---

# మానవ హక్కుల వేదిక

## ఉమ్మడి నల్లగొండ జిల్లా మహాసభ

- ఎక్కడో కాశ్మీర్, అయోధ్య లలో జరిగే దాని  గురించి మనం ఎందుకు పట్టించుకోవాలి?

**పి.ఎస్. కృష్ణ**

- మానవ హక్కులు అంటే ఏంటి? పట్టణాల్లో, గ్రామాల్లో ఉన్న సామాన్యుల జీవితానికి అవి ఎట్లా వర్తిస్తాయి?

**ఏ. చంద్రశేఖర్**

- మనిషి మనుగడకి మౌలికమైన హక్కులు: తోడు, నీడ. ఎవరు తోడు, ఏది నీడ? వీటిని ఎలా కోల్పోతున్నాం, ఈ హక్కులని  కాపాడుకోడం ఎలా?

**ఎస్. సుజన**

- రోజు రోజుకి  మారుతున్న ప్రపంచంలో మన బాగు, మన పిల్లల బాగు చూసుకోవడం ఎలా?

**ఎస్. అమర్**

**వాసవి భవన్, మెయిన్ రోడ్డు, మిర్యాలగూడ**
**Saturday, 30 November 2019**
5:30 p.m. to 7:30 p.m.

*రండి, మన జీవితం, మన సమాజం గురించి కలిసి మాట్లాడుకుందాం.*

---

మనిషి సంఘ జీవి. అంటే ఏదో ఒక సమాజంలో తప్ప విడిగా బతకలేని జీవి. ఆ సమాజాలు సంస్కృతులుగా, దేశాలుగా, జాతులుగా విడిపడి ఉంటునట్టు కనిపించినప్పటికీ అందరం బతికేది భూమి మీదనే. విశ్వం మొత్తంలో జీవం ఉన్నది కేవలం భూగ్రహం మీదనే.  అంటే మనకి ఉన్న తోడు సాటి మనుషులైతే, మనందరికీ నీడనిచ్చేది భూమి.

అయితే తోటి మనుషులతో కానీ, భూమితో కానీ మన సంబంధాలు ముందున్నంత బాగాలేవు.  పైగా రాను రాను ఇంకా దెబ్బతింటున్నాయి. ఇది ఎవరికీ ప్రత్యేకంగా నిరూపించాల్సిన పని లేదు, మనందరి అనుభవంలో ఉన్న విషయమే.

అయితే ఈ సంబంధాలు బాగుచేసుకోలేనంతగా ఇంకా చెడిపోలేదు.




అసలు అవి ఎలా  చెడిపోయాయి, వాటిని తిరిగి ఎలా బాగుచేసుకోవాలి అనే విషయంలో మనకు స్పష్టత లేదంతే. మన చుట్టూ ఎంతో బలంగా అల్లుకుపోయిన ఆర్థిక వ్యవస్థ మనకు ఆ స్పష్టత రానివ్వకుండా చేస్తుంది. ఒకవేళ ఆ స్పష్టత వచ్చినా మనం ఒక్కళ్ళమే ఏం చెయ్యగలం అనే నిస్సహాయత, నిరుత్సాహంతో అందరూ ఎటు పోతే మనం కూడా అటే పోదాములే అనుకుంటున్నాము.

మానవ చరిత్రలో ఇలాంటి పరిస్థితి రావడం ఇది మొదటిసారి ఏమీ కాదు. చరిత్ర పొడవునా మనిషి జీవితం, సమాజం ఎన్నెన్నో మార్పులకు లోనవుతూ వచ్చింది. అయితే, ఒక జాతిగా ఎన్నో ముందడుగులు వేస్తూ వచ్చినా, ఆ  క్రమంలో మన మనుగడకే ఆధారమైన భూమి తో మనకున్న బంధం బలహీనమైపోతూ వచ్చింది. సమాజం పరంగా చూస్తే మనుషుల మధ్య ఉన్న సంబంధాలు కూడా బలహీనమవుతూ వస్తున్నాయి. ఎప్పుడైనా మనం ప్రేమించే వాటికే విలువనిస్తాం, కాపుడుకుంటాం. భూమి తో, సాటి మనుషుల తో బంధాలు బలహీనమయే క్రమంలో భూమి, సమాజం ఎంతో వినాశనానికి గురవుతున్నాయి.

మానవ జాతి ప్రగతి ని మరో కోణం లో చూస్తే  జరిగే మార్పులను అవకాశంగా తీసుకుని ఎప్పటికప్పుడు కొన్ని వర్గాలు శక్తివంతులుగా, సంపన్నులుగా మారి, సమాజాలను తమ గుప్పిట్లో పెట్టుకునే ప్రయత్నాలు చేయడం కనిపిస్తుంది. ఆ శక్తిసంపదలతో వారు మొదట రాజకీయాలను, ప్రభుత్వాలను, వాటి ద్వారా ఆర్థిక వ్యవస్థను, చివరిగా సమాజాన్నీ తమకు అనుకూలంగా మార్చుకుని సామాన్య ప్రజల జీవితాలను తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. అయితే తమ జీవితాలు పరాధీనమవడానికి అంగీకరించని ప్రజలు పోరాటాలు చేసి వారి పరిస్థితులను మార్చుకోవడం కూడా మనకి కనిపిస్తుంది. బహుశా ఆ పోరాటాలు చేసే ముందు ఆ ప్రజలు కూడా ఇప్పుడు మనం ఎదుర్కొంటున్న నిస్సహాయ స్థితినే అనుభవించి ఉండవచ్చు.

అయితే ఇప్పుడు మన జీవితాలు ఎవరి అధీనంలో ఉన్నాయో మనకే అర్థం కానటువంటి స్థితిలో ఉన్నాం. దానికి కారణం మనకు అంతుపట్టనంత సంక్లిష్టంగా ఉన్న మన ఆర్థిక వ్యవస్థ, పూర్తిగా అర్థం లేకుండా పోయిన రాజకీయాలు, ప్రభుత్వాలు. సొంత కష్టంతో పంటలు పండించే రైతులు కూడా ఈ రోజు స్వతంత్రంగా లేరు. వారి జీవితాలు పూర్తిగా ప్రభుత్వ, కార్పొరేట్, మార్కెట్ శక్తుల అధీనంలో ఉన్నాయి.  ఆ శక్తులు నిర్దేశిస్తున్న విధంగా వ్యవసాయం చేస్తున్నందువల్ల భూసారం, భూగర్భ జలాలు, వారి ఆరోగ్యం, ఆ పంటలు తినే వారి ఆరోగ్యం - ఇవన్నీ ఏ విధంగా క్షీణిస్తూ వస్తున్నాయనేది గుర్తించి, వాటి గురించి ఆలోచించగల సామర్థ్యాన్ని నేర్పాల్సిన విద్యా వ్యవస్థ ఇప్పుడున్న ఆర్థిక వ్యవస్థను కొనసాగించే ఉద్యోగులని, వినియోగదారులని తయారుచేసే పనిలో మునిగిపోయింది.

పరిస్థితులు ఎంత నిరాశ కలిగించేలా ఉన్నా మనుషులకు ఇలాంటి వ్యవస్థ మనకి ఇంక వద్దు అనిపించినప్పుడు ఆ పరిస్థితులను మార్చుకుంటూనే వచ్చారు. ఇప్పుడు కూడా మనం గట్టిగా తల్చుకుంటే, అందరం కల్సి ముందుకు వస్తే  మనకి నష్టం చేస్తూ, మనల్ని విడదీసే మార్పులను అడ్డుకొని, మనకి మంచి చేసే, మన సంబంధాలను మెరుగుపరిచే, బలపరిచే దిశగా మన వ్యవస్థను మార్చుకోవచ్చు. అది మన చేతుల్లో, చేతల్లో ఉన్న విషయం.



అలా మనం గట్టిగా తల్చుకోవాలంటే, అందరం కల్సి ముందుకురావాలంటే మన చుట్టూ ఉన్న సమాజం లో ఏం జరుగుతుంది, జరిగేదానికి మన జీవితాలకి సంబంధం ఏమిటి, మనం ఎందుకు ఇదంతా పట్టించుకోవాలి అనే ప్రశ్నలకి సమాధానం తెల్సుకోవాలి.

ఎక్కడో ఉన్న కశ్మీర్ లోని  పరిస్థితులతో మనకేంటి సంబంధం అని మనకి అనిపించవచ్చు. కశ్మీర్ ను  మన దేశంలో భాగంలా చూడటం, ఒక సుందరమైన పర్యాటక ప్రదేశంలా చూడడం తప్పించి అక్కడ ఉండే మనుషుల గురించి, వారి జీవితాల గురించి మనలో చాలామంది ఎప్పుడూ ఆలోచించి ఉండం. ఒకవేళ ఆలోచించినా, ఆలోచించి బాధ పడినా - మనమేం చెయ్యగలం అనే నిస్పృహ, పోనీలే కనీసం మనమున్న రాష్ట్రంలో అలా ఎప్పటికీ జరగదు అనే భరోసాతో బతికేస్తూ ఉంటాం. అలాగే అయోధ్య విషయంలో కూడా. అయోధ్య విషయంలో, కశ్మీర్ విషయంలో బాధితులు మన ప్రాంతం లేదా మన మతానికి చెందని వాళ్ళు కదా మనకేం నష్టం అని అనుకోవచ్చు. కానీ ఒకే సమాజంలో, ఒకటే భూమి పైన నివసిస్తున్నప్పుడు తోటి మనిషికి, తోటి జీవరాశులకు కలిగే నష్టం ఎప్పటికీ మన వరకు రాకుండా, మనల్ని అంటుకోకుండా ఉండటం సాధ్యమా?

జీవించగలగడం అనే హక్కు ఉన్న తరువాతనే మిగిలిన హక్కులన్నీ. జీవించడానికి ఆధారం మన తోటి మనుషులతోను, భూమితోను ఉన్న సంబంధాలే. కాబట్టి సాటి మనుషులతోను, భూమి తోను సరైన సంబంధాలు కలిగి ఉండటమే మనకుండాల్సిన అతి మౌలికమైన హక్కు. అది గుర్తించి, ఆ హక్కును కాపాడుకోవాలంటే ముందుగా మనమున్న సమాజంలోని పరిస్థితుల గురించి సరైన అవగాహన ఏర్పరచుకోవాలి. ఆ అవగాహనతో ప్రభుత్వ,  దేశీయ, విదేశీ కార్పొరేషన్ల అధీనంలో ఉన్న మన జీవితాలను తిరిగి మన అధీనంలోకి తెచ్చుకోవాలి.

ప్రస్తుతం చలామణీలో ఉన్న అభివృద్ధి దృక్పథం, అమల్లో ఉన్న ఆర్థిక వ్యవస్థ మనల్ని సంఘ జీవులుగా కాక స్వావలంబన (ఇండిపెండెన్స్) గల వ్యక్తులుగా జీవించమని ప్రోత్సహిస్తోంది. ఆర్థిక స్వావలంబన సాధించడమే అత్యంత గొప్ప విజయంగా చూపెడుతుంది. అయితే మనిషిని ఆ విధమైన వ్యక్తిగా రూపొందించాలనుకోవటంకంటే పెద్ద పొరపాటు ఏదీ ఉండదు. ఆలా బతకడం గొప్ప అని నేర్పటం కంటే పెద్ద మోసం ఏదీ ఉండదు. పుట్టుక నుంచి చావు దాకా మన జీవితంలో ఏదీ ఒంటరిగా జరగదు. ఒక వ్యక్తిగా మనకున్న వ్యక్తిత్వాన్ని నిలుపుకుంటూనే ఇతర మనుషులతో, భూమితో మనకున్న అనివార్యమైన సంబంధాన్ని మనమందరం గుర్తించాల్సిన, గౌరవించి కాపాడుకోవాల్సిన సమయం ఇది. మనం ఒక్కళ్ళమే ఏం చెయ్యగలం అనే నిస్పృహను, సందేహాలను పక్కకి నెట్టి అందరం ఒకటిగా పని చెయ్యటానికి ముందుకి రావాలని పిలుపునిస్తూ ఈ సభని జరుపుతున్నాము. మీరు తప్పకుండా వస్తారని ఆశిస్తున్నాము.

**మానవ హక్కుల వేదిక**
ఉమ్మడి నల్లగొండ జిల్లా

---

*ప్రచురణకర్త: ఎన్. హరిందర్ -- phone: 9490024411*